సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు
ఎంజీఎంలో మూడు రోజులుగా ఎక్స్ రే సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో▸



ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన అంబేడ్కర్
దేశ ఔన్నత్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు అంబేడ్కర్ అని మంత్రి కొండా సురేఖ అన్నారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.2^0 / 19.7^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మహబూబాబాద్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. అగ్ని మాపకశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాలను ప్రజలు వీక్షించాలన్నారు. ప్రమాదాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది కృష్ణ, రవీందర్, వెంకన్న, చందర్, గోపి, విశ్వనాథ్, జీవన్, రవి ఉన్నారు.

రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రం





రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రాన్ని గీసిన విద్యార్థిని అమూల్య

కేసముద్రం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.అమూల్య అంబేడ్కర్ చిత్రాన్ని రావి ఆకుపై చిత్రీకరించింది. అలాగే సుద్దముక్కపై అంబేడ్కర్ అని ఆంగ్ల అక్షరాలను చెక్కింది. ఈ మేరకు సూక్ష్మకళను ప్రదర్శించిన విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించింది. అదే విధంగా 'అందరివాడు అంబేడ్కర్'అనే అంశంపై ఈనెల 8న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అమూల్య ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, రాంచంద్రునాయక్ చేతుల మీదుగా అమూల్య ప్రశంసపత్రం అందుకున్నట్లు తెలిపారు.

సభను విజయవంతం చేయాలి




గంగారం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో ఈనెల 17న ఎస్టీ తెగల వర్గీకరణ కోసం నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం అన్నారు. సోమవారం మండలంలోని మడగూడెం గ్రామంలో చలో ఇల్లెందు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కత్తి రమేశ్, యాప లక్ష్మణ్‌రావు, ఈసం నర్సింహారావు, మోకాల సత్యం, యాప సందయ్య, యాప వీరలక్ష్మి, ఈసం గౌరయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఓ సస్పెన్షన్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ జిల్లా కార్యాలయంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.నాగేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తూ సోమవారం రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగేశ్వర్‌రావు అధికార దుర్వినియోగం చేశారని, మరిపెడ మండలంలో ఓ పరిశ్రమకు ఫేక్ ఎన్‌ఓసీ ఇచ్చారని, ఇలా పలు కారణాలతో ఈ నెల 11న సస్పెండ్ చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఆయన ఇచ్చిన ఎన్‌ఓసీలపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

ఆర్చరీ అసోసియేషన్ సభ్యుడిగా శంకరయ్య



మహబూబాబాద్ అర్బన్: దేశంలో ఆర్చరీ క్రీడాభివృద్ధికి కోసం ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈమేరకు మానుకోట జిల్లా వాసి పుట్ట శంకరయ్య కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా కమిటీ సభ్యులు దేశవ్యాప్తంగా పర్యటనలు చేసి ఆర్చరీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటారు. పుట్ట శంకరయ్య ఏఏఐ సభ్యుడిగా ఎన్నిక కావడంపై ఉమ్మడి జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు సాదుల సారంగపాణి, ఖమ్మం జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణాపర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు నెలలు.. ఏడు హత్యలు

- క్షణికావేశంతో పాటు తప్పు కప్పిపుచ్చుకోవడానికి ఘాతుకాలు
- సంబంధికుల చేతిలో హతమవుతున్న వైనం
- వరుస ఘటనలతో జిల్లా ప్రజల ఆందోళన
- అవగాహన సదస్సులు పెంచుతామంటున్న పోలీసులు



అయిన వారి చేతిలోనే హతం
ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు వరుసగా ఏడు హత్యలు జరిగాయి. కాగా ఇవన్నీ కూడా కుటుంబ సభ్యులు, దగ్గరి మిత్రులు చేసిన హత్యలే కావడం గమనార్హం. సొంత కుటుంబ సభ్యులే లక్షల రూపాయల సుపారీ మాట్లాడుకొని హత్య చేయించారు. ఇందుకు ప్రధాన కారణాలు అనుమానం, వివాహేతర సంబంధాలు, వ్యాపారాలకు అడ్డుగా ఉండడమే.

సాక్షి, మహబూబాబాద్: జీవితం నీటి బుడగ లాంటిది. ప్రతీ మనిషికి మరణం తప్పదు. అయితే అది సహజ మరణమైతే.. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు బాధతో కుమిలిపోతారు. అదే హత్య అయితే ఆ ప్రాంత ప్రజలంతా భయాందోళన చెందుతారు. కాగా జిల్లాలో నాలుగు నెలల్లో వరుసగా ఏడు హత్యలు జరిగా యి. ఇందులో అత్యధికంగా తమకు అన్యాయం చేశారనే నెపంతో హత్యలు చేసిన సంఘటనలు ఉండగా.. అయిన వారే సుపారీ మాట్లాడి చంపించిన ఘటనలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కాగా వరుస హత్యల నేపథ్యంలో సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పోలీసులు చెబుతున్నారు.

హత్యలు ఇలా..

- అనుమానంతో భర్త భార్యను కత్తితో పొడిచి, కట్టెలతో కొట్టి తీవ్ర గాయపరిచి హత్య చేసిన సంఘటన జనవరి 25న కేసముద్రం మండలంలో జరిగింది. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన వాంకుడోత్ సుగుణ(30)ను తన భర్త వాంకుడోత్ రఘు కత్తితో పొడిచి, కట్టెలతో కొట్టి గాయపరిచాడు. తీవ్ర గాయాలైన సుగుణను చికిత్స నిమిత్తం ముందుగా మహబూబాబాద్ ఆస్పత్రికి, తర్వాత ఎంజీఎంకు తరలించారు. అయితే జనవరి 28న సుగుణ మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు.
- మహబూబాబాద్ పట్టణంలోని సిగ్నల్ కాలనీలో నివాసం ఉంటున్న నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఐటిపాములకు చెందిన దంపతులు కాటి రాములు–లక్ష్మి, కుమారుడు గోపి, కుమార్తె, అల్లుడు కలిసి కోడలు నాగలక్ష్మిని జనవరి 14న ఇంట్లో చంపారు. ఇంటి ముందు గుంత తవ్వి పూడ్చేశారు. అక్కడే వంట చేసుకొని తిన్నారు. అయితే ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రానికి చెందిన పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలోని జ్యోతిబాపూలే గురుకులంలో హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త పార్థసారథిని చంపేందుకు భార్య స్వప్న, ప్రియుడు వెంకట విద్యాసాగర్‌తో కలిసి రూ.5లక్షల సుపారీ మాట్లాడింది. ముగ్గురితో భర్తను హత్య చేయించగా.. పోలీసులు కేసును ఛేదించారు.
- సీరోలు మండలం బూర్గుచెట్టు జీపీ పరిధి మాంజా తండాకు చెందిన మాలోత్ కళావతి(38)ని తన భర్త బాలు మటన్ కూర వండలేదని హత్య చేశాడు. దీనిపై సీరోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.
- పాత గొడవల కారణంగా ఇనుగుర్తి మండలం మీఠ్యాతండాకు చెందిన గుగులోత్ రమేశ్(36)ను అదే తండాకు చెందిన గుగులోత్ శంకర్ నమ్మబలికి తనతో ఒంగోలు తీసుకెళ్తానని చెప్పి హత్య చేసిన సంఘటనపై నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- మార్చి 15న డోర్నకల్ మండలంలోని హూన్య తండాకు చెందిన భూక్య భుజ్జిని కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్త హత్య చేసినట్లు ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఫిబ్రవరి 3న డోర్నకల్ మండలంలో జోగ్యతండాలో పిల్లలకు టానిక్‌లో హెర్బిసైడ్ అనే పురుగుల మందును కలిపి తాగించారు. ఈ సంఘటనలో ఐదు సంవత్సరాల నిత్యశ్రీ మృతి చెందిన సంఘటనపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం



వరుస సంఘటనలు జరగడంపై శాఖాపరమైన సమీక్షలు నిర్వహిస్తున్నాం. అయితే ప్రధానంగా క్షణికావేశం, ఇతర గొడవలతోపాటు మానవ సంబంధాలు, భార్య, భర్తలు ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడంతోనే ఎక్కువ హత్యలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, కళాజాత ద్వారా మానవ సంబంధాలు పెంచేందుకు ప్రదర్శనలు ఇప్పించే పనిలో ఉన్నాం.

-తిరుపతిరావు, డీఎస్పీ, మహబూబాబాద్

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్
- జిల్లా కేంద్రంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

మహబూబాబాద్ అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టుసెంటర్‌లో అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఎస్సీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి నర్సింహరావు, కార్పొరేషన్ జిల్లా అధికారి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి అని, ప్రపంచ దేశాల రాజ్యాంగాలను చదివి భారత రాజ్యాంగాన్ని రచించి స్వేచ్ఛ, హక్కులను కల్పించారన్నారు. రిజర్వేషన్లు కల్పించడంతో నేడు దళిత, గిరిజనులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సమాజంలో ఇప్పటికీ చాలా మంది చదువుకు దూరంగా ఉన్నారన్నారు. ఇంకా దేశంలో అసమానతలు, దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దళిత, గిరిజనులు చైతన్యవంతులై ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ మాట్లాడారు. అనంతరం భారత రాజ్యాంగంపై ఎమ్మెల్యేలు, నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్, వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

అంబేడ్కర్ ప్రపంచ మేధావి

మహబూబాబాద్: బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అంబేడ్కర్ 134 జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. దేశంలో మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. వెనుకబడిన కులాలు ఐక్యంగా ఉండాలని సూచించారు. బీసీలకు న్యాయం చేయడం కోసం బీసీ కుల గణన చేపట్టినట్లు పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న నలుగురు దంపతులకు చెక్కులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్‌సుధాకర్, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నర్సింహస్వామి, కుల సంఘాల నాయకులు కిషన్‌నాయక్, పీరయ్య, కామ సంజీవరావు, కొండ్ర ఎల్లయ్య, బీమానాయక్, లక్ష్మణ్ ఉపేందర్ ఉన్నారు.

'మండే' ఎండలు



శీతల పానీయాలు తాగుతున్న ప్రజలు



నిర్మానుష్యంగా మారిన మహబూబాబాద్ పట్టణంలోని నర్సంపేట రోడ్డు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 10దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం
- శీతల పానీయాలు, పండ్ల కొనుగోలు
- ఏసీ, కూలర్లకు భలే గిరాకీ

ఐదు రోజులుగా జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీ సెల్సియస్‌లో)

తేదీ	గరిష్ట	కనిష్ట
10	38	25
11	37	23
12	38	26
13	37	24
14	40	27



సాక్షి, మహబూబాబాద్: ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి ప్రతాపంతో ఉదయం 10గంటల తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 5గంటల తర్వాతనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. అత్యవసర పనులపై మధ్యాహ్నం బయటకు వచ్చిన వారు శీతల పానీయాలు తాగుతున్నారు. అలాగే నీటినిల్వలు ఎక్కువగా ఉండే పండ్ల కొనుగోలుకు పోటీ పడుతున్నారు. కూలర్లు, ఏసీలకు గిరాకీ మొదలైంది.

రోడ్లన్నీ నిర్మానుష్యం

జిల్లా కేంద్రం మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోని వ్యాపార కూడళ్లు ఉదయం 10తర్వాత జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్, కోర్టు రోడ్డు, కొత్త బస్టాండ్, ఇల్లెందు క్రాస్, తొర్రూరు పట్టణంలోని వరంగల్– ఖమ్మం ప్రధాన రహదారి, మరిపెడ బస్టాండ్ సెంటర్, కార్గిల్ సెంటర్, డోర్నకల్ బూడిదగడ్డ, సుభాష్ స్ట్రీట్ ఉదయం గంటల తర్వాత వెలవెలబోతున్నాయి.

శీతల పానీయాలు, పండ్ల కొనుగోలు

ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలు, కర్బూజ, పుచ్చకాయ, కీరదోస మొదలైన పండ్లు కొనేందుకు పోటీ పడుతున్నారు. పదిరోజుల క్రితం గిరాకీ లేక వెలవెలబోయిన దుకాణాలు ఇప్పుడు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. అదేవిధంగా కుండలు, రంజన్‌లకు గిరాకీ పెరిగింది. ఏసీలు, కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడుతున్నారు.

చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్త



ఎండల తీవ్రత పెరుగుతోంది. దీంతో హీట్ స్ట్రోక్, లూజ్ మోషన్స్ అవుతున్నాయి. వాంతులు, జ్వరంతో విరోచనాలు అవుతున్నాయి. డీ హైడ్రేషన్‌తో శరీరంలో లవణాల శాతం తక్కువై ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఎండ దెబ్బ తగిలితే కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ స్థితికి వెళ్లే ప్రమాదం ఉంది. వారిని ఎండకు వెళ్లకుండా చూసుకోవాలి. ప్రతీ ఒక్కరు నీరు అధికంగా తాగాలి.

-జగదీష్, ఆర్‌ఎంఓ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

వనాలపై పట్టింపేది?

- నిర్వహణ లేక అధ్వానంగా పట్టణ ప్రకృతి వనాలు
- నీటి సరఫరా లేక ఎండిపోతున్న మొక్కలు
- మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 51 వనాలు

మహబూబాబాద్: ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో ముఖ్యంగా గ్రీన్‌ల్యాండ్స్ పరిరక్షణలో భాగంగా వాటిని ఏర్పాటు చేశారు. నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

51 పట్టణ ప్రకృతి వనాలు..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు, 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. ఉద్యోగ, విద్య, వ్యాపార రీత్యా మానుకోటలో నివాసం ఉండే వారితో కలిపితే జనాభా లక్ష దాటుతుంది. 2020 నుంచి 2023 వరకు 51పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో 1,46,626 మొక్కలు నాటారు. 10 ప్రకృతి వనాలకు ప్రహరీల నిర్మాణం చేపట్టగా, మిగిలిన 41 వనాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. విస్తీర్ణం ఆధారంగా పలు చోట్ల సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. కొన్ని వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. అలాగే చెట్లకు నీరు అందించేందకు నాలుగు ట్యాంకర్లు కూడా కొనుగోలు చేశారు.



ప్రహరీ కూలిపోయిన నందినగర్ ప్రకృతి వనం

20మందితో గ్రీన్ టీం..

పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ కోసం 20మందితో గ్రీన్ టీం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.12,000 వేతనం ఇస్తున్నారు. అయితే సరిపడా సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. గ్రీన్ బడ్జెట్ సక్రమంగా విడుదల కాకపోవడంతో జనరల్ ఫండ్ నుంచి 10శాతం కేటాయించి సిబ్బందికి వేతనాలు ఇస్తున్నారు. అయితే వారికి రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటం, పలు కారణాల వల్ల వనాల నిర్వహణ అధ్వానంగా మారింది. అలాగే జిల్లా కేంద్రంలోని డివైడర్ల మధ్యలోని చెట్లకు నీటి సరఫరా బాధ్యత కూడా వారిపైనే ఉంది. దీంతో వారిపై పని భారం పెరిగి సరిగా నిర్వహణ బాధ్యతలు చేపట్టలేకపోతున్నారు.

ఎండిపోతున్న మొక్కలు..

ప్రస్తుత వేసవిలో నీటిసరఫరాలో జాప్యం జరుగుతోంది. సరిపడా నీరు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు ఉన్నచోట వాకర్లు నిర్వహణపై దృష్టి పెడుతున్నారు.. అలాగే అధికారులకు తెలియజేస్తున్నారు. డివైడర్ల మధ్యలో నాటిన అలంకరణ మొక్కలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. కాగా ట్యాంకర్ల ద్వారా ప్రకృతి వనాలకు నీటి సరఫరా చేయాలని, నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, కూలిపోయిన ప్రహరీల స్థానంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టాలని, పాడైన బెంచీలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాం

పట్టణ ప్రకృతి వనాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గ్రీన్ టీం సభ్యులు ప్రతీరోజు పనులు చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నిధులను బట్టి పనులు జరుగుతున్నాయి.

- గుజ్జు క్రాంతి, పర్యావరణ అధికారి

బడ్జెట్ కేటాయించాం

జనరల్ బడ్జెట్‌నుంచే 10శాతం నిధులు కేటాయించి గ్రీన్ టీం సభ్యులకు వేతనాలు ఇస్తున్నాం. పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ కోసం ఖర్చు చేస్తున్నాం. రెండు నెలల వేతనాలు కూడా త్వరలో వారి ఖాతాల్లో జమ చేస్తాం. వనాలకు నీరు అందించేందుకే నాలుగు ట్యాంకర్లు కొనుగోలు చేశాం.

-సోముల రవీందర్, మున్సిపల్ కమిషనర్

సీఎం సమావేశంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవిలో తాగునీటి ప్రణాళికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

కలెక్టరేట్‌లో రగడ

- అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో నాయకుల మధ్య ఘర్షణ

మహబూబాబాద్: అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో వేదికపైకి కొంతమంది నాయకుల పేర్లు పిలవకపోవడంతో ఘర్షణకు దారి తీసింది. ఈక్రమంలో నాయకులు అధికారితో వాగ్వాదం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కాగా ఆశాఖ ఇన్‌చార్జ్ అధికారి నర్సింహస్వామి వేదికపైకి ముఖ్య అతిథులను పిలిచారు. ఈక్రమంలో కొంతమంది కుల సంఘాల నాయకులను పిలవలేదని అధికారితో వాగ్వాదం చేశారు. ఆతర్వాత వేదికపై నాయకుడు బీమా నాయక్ కూర్చోగానే వెంటనే మరో నాయకుడు కామ సంజీవరావు నువ్వు అక్కడ ఎందుకు కూర్చుంటున్నావని వాగ్వాదం చేశాడు. వెంటనే బీమానాయక్ నీకెందుకు నా విషయం అని కుర్చీ లేపాడు. దీంతో వారిద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడడం పూర్తికాగానే నాయకులు పొన్నాల యుగేందర్, దర్శనం రామకృష్ణ మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఇతర కార్యక్రమాలు ఎందుకు నిర్వహించారని అధికారితో వాగ్వాదం చేశారు. అలాగే సీఎం కార్యక్రమం ఉందని వెళ్తున్నామని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అనగా.. అందరూ వెళ్తే కార్యక్రమం ఎందుకని నాయకులు అన్నారు. వెంటనే రాంచంద్రునాయక్ జోక్యం చేసుకుని కార్యక్రమం ముగిసిన తర్వాతే వెళ్తామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అంబేడ్కర్ జయంతి రోజ గొడవ పడడంపై ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కూడా ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కార్యక్రమం అనంతరం కూడా కామసంజీవ రావు అనుచరులకు బీమానాయక్ అనుచరుల మధ్య గొడవ జరుగగా పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు.



కలెక్టరేట్‌లో కామ సంజీవరావుకు బీమానాయక్‌కు మధ్య వాగ్వాదం

భూభారతితో రైతులందరికీ మేలు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- మానుకోట రైతు వేదికలో సీఎం ప్రసంగం వీక్షణం

మహబూబాబాద్ రూరల్ : సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి పోర్టల్ ద్వారా రైతులందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సోమవారం రాత్రి భూభారతి పోర్టల్ ప్రారంభం సందర్భంగా హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని మానుకోట రైతు వేదికలో ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా ఎమ్మెల్యే మురళీనాయక్, వ్యవసాయ అధికారులు, రైతులు వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా రైతులు, సాధారణ ప్రజలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దుచేసి భూభారతి పోర్టల్ తీసుకొచ్చిందని తెలిపారు. ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, ఏఓ నారెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దేశెట్టి మల్లయ్య, కాంగ్రెస్ నేతలు దేవరం ప్రకాశ్‌రెడ్డి, రాంరెడ్డి, ఎడ్ల రమేశ్, ఖలీల్, అజ్మీరా సురేశ్, కోడి శ్రీను, బుజ్జి వెంకన్న, పూజారి వెంకన్న, రైతులు పాల్గొన్నారు.



సీఎం ప్రసంగం వీక్షిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, అధికారులు, రైతులు

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు..

● వివాహిత నవ్య బలవన్మరణంపై కేసు నమోదు


నవ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన నవ్య మృతిపై ఆమె తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం రాత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన శ్రీపాద ఉత్తరాచారి పెద్ద కుమార్తె నవ్య (21)ను ఇల్లందు మండలం ధర్మారం తండాకు చెందిన తాడూరి భిక్షమాచారి, సత్యవతి దంపతుల కుమారుడు రవిచంద్రాచారికి ఇచ్చి గతేడాది డిసెంబర్ 26వ తేదీన వివాహం జరిపించారు. వివాహం సమయంలో రూ.50 వేలు కట్నం ఇచ్చారు. భర్త రవిచంద్రాచారి, అత్తామామ భిక్షమాచారి, సత్యవతి తరచూ అదనపు కట్నం కోసం నవ్యను వేధింపులకు గురిచేస్తుండేవారు. ఈ క్రమంలో పలుమార్లు పంచాయితీలు జరగగా అదనపు కట్నం డబ్బులు తర్వాత ఇస్తామని ఆపుకుంటూ వచ్చారు. ఆదివారం సాయంత్రం నవ్య తాను ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడుతున్నానని పక్కింటి వారికి చెప్పగా వారు హుటాహుటిన వచ్చి భర్త రవిచంద్రాచారికి చెప్పారు. అప్పటికే ఆమె ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారని సీఐ తెలిపారు.

మండలంలో రెండు చోట్ల చోరీలు


బీరువాను పగులకొట్టిన దొంగలు

వెంకటాపురం(కె): మండలంలోని ఉప్పేడు గొల్లగూడెం, మండ కేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం చోరీలు జరిగాయి. బాధితుల కథనం ప్రకారం.. ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన నాగేశ్వరావు రాత్రి నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంటి ఎదుట ఉన్న షెట్టర్ పగుల కొట్టి అందులో ఉన్న రూ. 50 వేల నగదు, ఓ సెల్‌ఫోన్ అపహరించారు. అలాగే, మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు సంకా హేమ సుందర్ ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగుల కొట్టి అందులో ఉన్న కిలో వెండి, 18 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు..

ఆస్పత్రిలో నిలిచిన ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు
● మూడు రోజులుగా ఆ గదికి తాళం
● గాయాలతో క్షతగాత్రుల నరకయాతన, ఆర్తనాదాలు
● పట్టించుకోని ఆస్పత్రి ఉన్నతాధికారులు


తాళం వేసి ఉన్న ఎమర్జెన్సీ ఎక్స్‌రే గది


ఎక్స్‌రే సేవల కోసం స్ట్రెచర్‌పై వచ్చిన క్షతగాత్రుడు (ఫైల్)

ఎంజీఎం : ఉత్తర తెలంగాణ పేద రోగుల పెద్దదిక్కు ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక్క సమస్య తలెత్తుతూనే ఉంది. ఒక రోజు మందులు ఉండవు.. మరో రోజు వైద్యులు రారు. అన్ని బాగున్నాయి.. అనుకున్న క్షణమే పరికరాల్లో సాంకేతిక లోపమంటూ సేవలు అందవు.. ఇలా ఆస్పత్రిలో ఏ విభాగంలో చూసినా ఏదో సమస్య కనిపిస్తూనే ఉంటుంది. ఫలితంగా ఎంజీఎంకు వస్తే పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందుతాయా అనే నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఈక్రమంలో మూడు రోజుల నుంచి ఆస్పత్రిలో అత్యంత కీలక విభాగమైనా క్యాజువాలిటీలో ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు నిలిచాయి. ఈ సేవలను వెంటనే పునరుద్ధరణ చేయాల్సిన అవసరమన్నా రోజులు తరబడిగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్షతగాత్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒక పక్క ప్రమాదంలో విరిగిన కాళ్లు, చేతులతో ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగానికి వస్తే చికిత్స కోసం ఎక్స్‌రే పనిచేయకపోవడంతో ఇక్కడి నుంచి నుంచి ఓపీ బ్లాక్‌లో ఉన్న ఎక్స్‌రే గదికి క్షతగాత్రులను తరలించే సమయంలో వినబడుతున్న ఆర్తనాదాలు అందరినీ కంటతడిపెట్టిస్తున్నాయి.

చికిత్స కోసం తిప్పలు పడాల్సిందే..

ఎమర్జెన్సీ ఎక్స్‌రే పరికరం పనిచేయకపోవడంతో ఈ సేవల కోసం క్షతగాత్రుల బంధువులు తిప్పలు పడాల్సి వస్తోంది. క్షతగాత్రుడిని క్యాజువాలిటీ నుంచి ఓపీ బ్లాక్‌లోని 92 గదికి తరలించేందుకు వీల్ చైర్స్, స్ట్రెచర్స్ దొరకబట్టడానికి కుస్తీ పట్టాల్సిందే. ఆస్పత్రిలోని 92 గది ఎక్కడ అని తెలుసుకునేందుకు మరో ప్రయత్నం చేయాలి. చివరకు అక్కడికి వెళ్లాక ఒకే ఒక్క ఎక్స్‌రే పరికరం పనిచేస్తుండడంతో సేవల కోసం ఎదురుచూడాలి.. ఆ సమయంలో క్షతగాత్రుల రోదనలు చూడలేక సిబ్బందితో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఎంజీఎంలో అత్యవసర సేవల కోసం వచ్చిన క్షతగాత్రుల బాధలు నిత్యం పెరిగిపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారు. ఉన్న ఒకే ఒక్క ఆర్ఎంఓ అన్ని పనులు చక్కబెట్టలేక చేతులేత్తేస్తున్న దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా మంత్రులు స్పందించి ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించాలని రోగులు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేస్తాం..

ఎమర్జెన్సీ పరికరంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఎక్స్‌రే సేవలను 92 గదిలోని డిజిటల్ ఎక్స్‌రే ద్వారా అందిస్తున్నాం. ఎమర్జెన్సీ విభాగంలో ఎక్స్‌రే పరికరానికి మరమ్మతులు చేపడుతాం.

-కిశోర్, సూపరింటెండెంట్

మోటార్లతో నీటిని తోడేశారు


మోటారు ద్వారా నీటిని తోడేస్తున్న రైతు కుటుంబం


ధాన్యం పక్కన నిలిచిన నీటిని తొలగించేందుకు కష్టపడుతున్న రైతు రజిత కుటుంబం

● జనగామ మార్కెట్ ఐకేపీ సెంటర్‌లో రైతుల గోస

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌లో ఏ రైతును కదిలించిన కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షంతో 20వేల బస్తాలకు పైగా ధాన్యం తడిసి పోగా, వరద వెళ్లే దారిలేక ధాన్యం రాశుల పక్కనే నిలిచి ముంచేసింది. నీటిలో మునిగిన ధాన్యాన్ని బయటకు తీసేందుకు రైతులు మోటార్లు పెట్టి తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన రైతు దండబోయిన రజిత కుటుంబం ఐదు ఎకరాలు సాగు చేయగా, 200 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు నాలుగు రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చారు. తేమ పేరుతో కొనుగోలు ఆలస్యం కావడంతో అకాల వర్షం 200 బస్తాలను ముంచేసింది. 20 బస్తాలు వరదలో కొట్టుకుపోయాయి. రాత్రి 7.30 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు వరకు 180 బస్తాల ధాన్యం నీటిలోనే ఉండిపోయింది. దీంతో రైతులు ఇంట్లో వినియోగించే నీటి మోటారును తీసుకొచ్చి కుటుంబమంతా నాలుగు గంటల పాటు కష్టపడి తోడేశారు. ఒక్క అధికారి వచ్చి పలకరించలేదని, టార్పాలిన్ కవర్లు సైతం ఇవ్వలేదని మహిళా రైతు రజిత.. కన్నీరుమున్నీరుగా విలపించారు. 12 గంటలపాటు తడిసిన ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని ఆందోళనే వ్యక్తం చేస్తున్నారు.

హాల్ మార్కింగ్ లైసెన్సు రద్దుతో ఇబ్బందులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 18 హాల్ మార్కింగ్ సెంటర్ల లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేయడంతో వినియోగదారులు మోసపోయే అవకాశాలున్నాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం వరంగల్ సీతారామ కాంప్లెక్స్‌లో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ బంగారు ఆభరణాల నాణ్యతకు ఉద్దేశించిన హాల్ మార్కింగ్ విధానం అమలు కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో న్యాయ సలహాదారు సీనియర్ అడ్వకేట్ రాయబారపు భిక్షపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, మిగతా అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీకి వస్తూ కానరానిలోకాలకు..

● హార్వెస్టర్ కింద పడి మహిళా కూలీ మృతి
● ఒకరికి తీవ్ర గాయాలు
● బూర్నపల్లి శివారులో ఘటన


కనుకమ్మ (ఫైల్)

టేకుమట్ల: కూలీకి వస్తూ ఓ మహిళ కానరానిలోకాలకు వెళ్లింది. హార్వెస్టర్ వెనక్కి వస్తుండగా దాని కింద పడి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బూర్నపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు వరి పంటలో బెరుకుల తీసేందుకు ఆటోలో బూర్నపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆటో ముందు హార్వెస్టర్ వెళ్తుండగా.. ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తోంది. దీంతో హార్వెస్టర్ ఆపరేటర్ బస్సుకు దారి ఇచ్చేందుకు వెనక్కి తీస్తున్నాడు. ఈ క్రమంలో హార్వెస్టర్ వెనుక ఉన్న ఆటోను డ్రైవర్ కూడా వెనక్కి తీస్తుండగా అందులో ఉన్న ఇద్దరు మహిళలు భయంతో కిందికి దిగారు. అయితే హార్వెస్టర్ వారిపైకి ఎక్కింది. ఈ ఘటనలో దాసరి కనుకమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందగా, మరో కూలీ వసంతకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వసంతను చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై దాసరి సుధాకర్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. అనంతరం కనుకమ్మ మృతదేహాన్ని చిట్యాల ఆస్పత్రి మార్చురీకి తరలిచారు.

కన్నీరుమున్నీరైన కూలీలు..

క్షణం ముందు ప్రాణంతో అందరి మధ్య ప్రయాణించిన కనుకమ్మ రెప్పపాటు క్షణంలో విగతజీవిగా మారడంతోపాటు మరో మహిళ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా చలించిన తోటి కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. సాయంత్రం కూలీకి రాకున్నా బతికేదేమో అని విలపించారు.

ప్రాణాలు తీస్తున్న సాయంత్రం కూలీ..

వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో వ్యవసాయ కూలీలు ఉదయం, సాయంత్రం రెండు పూటల పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మహిళా కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వెళ్లగా లారీ అదుపు తప్పి మీదపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే మొట్లపల్లి నుంచి కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వస్తుండగా హార్వెస్టర్ మృత్యుశకటమై కనుకమ్మను కబలించింది.

బావిలోపడి వ్యక్తి..


రాజయ్య (ఫైల్)

నెక్కొండ: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని వెంకటాపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాళ్లబండి పెద్ద రాజయ్య (56) ఈనెల 13న సాయంత్రం తన పొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారిలో గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరారావు వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. కుటుంబీకులు రాజయ్య కోసం వెతకగా సోమవారం సాయంత్రం బావిలో శవమై తేలి కనిపించాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నామని ఎస్సై తెలిపారు.

పెళ్లి బాధ.. చితికి చేర్చింది..

● సంబంధం కుదరడం లేదని యువకుడి బలవన్మరణం


వేణు(ఫైల్)

దుగ్గొండి: ఉన్నత విద్యనభ్యసించాడు. ఎంతకూ పెద్ద ఉద్యోగం రాలేదు. చివరికి ఓ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాడు. వచ్చే వేతనం ఖర్చులకూ సరిపోవడం లేదు. మంచి ఉద్యోగం లేదని వచ్చిన పెళ్లి సంబంధాలు రద్దవుతున్నాయి. దీంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంగోళి రాజేశ్వర్‌రావు, పద్మ దంపతుల కుమారుడు వేణు(30) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు సాగించి చివరికి తక్కువ వేతనానికి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అయితే వేతనం ఖర్చులకు సరిపోకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఈ విషయం తండ్రికి చెప్పడంతో వ్యవసాయం చేసుకుందామని చెప్పి ఓదార్చాడు. వ్యవసాయ పనులు చేయలేక పోయాడు. ఏ పనిచేయలేక తల్లిదండ్రులకు భారంగా మారానని మదనపడుతున్నాడు. ఇదే తరుణంలో వేణుకు అనేక పెళ్లి సంబంధాలు చూశారు. వేణు ఉద్యోగ వివరాలు తెలుసుకున్నాక పెళ్లి కూతురు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. ఇలా మూడు సంబంధాలు రద్దు అయ్యాయి. ఇక తనకు పెళ్లికాదని మనస్తాపంతో తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన మృతుడి అమ్మమ్మ లచ్చమ్మ దారి వెంట వెళ్తున్న వారిని పిలిచి విషయం చెప్పి తలుపులు తీయించింది. అప్పటికే వేణు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దించి చూడగా మృతిచెంది ఉన్నాడు. చేతికందొచ్చిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడడంతో రాజేశ్వర్‌రావు, పద్మ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

కులనిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్

● టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: సమాజంలో అంటరానితనం, కుల నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్ క్లబ్‌లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని సీఎండీ ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన, డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాజ్యాంగం మనుగడలో ఉన్నంతకాలం అంబేడ్కర్ పేరు చిర స్థాయిలో నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం, కార్యదర్శి ఎస్.కుమారస్వామి, ఫైనాన్స్ సెక్రటరీ నర్సింహారావు, టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ చైర్మన్ ఇ.నారాయణ, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డి.ఈలు విజేందర్ రెడ్డి, సామ్యనాయక్, జి.సాంబరెడ్డి, ఎస్.మల్లికార్జున్, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన అంబేడ్కర్

● మంత్రి కొండా సురేఖ
● ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు


శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్: దేశ ఔన్నత్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతూ.. రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత రూప శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ సామిశెట్టి ప్రవీణ్‌తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకం అన్నారు. పౌరుడి నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చాటిన మహామేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ ఫౌండేషన్ దాత మెరుగు అశోక్, విగ్రహ దాత రేణుకుంట్ల రవీందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాలేపాక నరేందర్, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల శివ, నాయకులు దిడ్డి కుమారస్వామి, మీసాల ప్రకాశ్, కొత్తపెల్లి శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, గడ్డం రవి, శ్రీరాం రాజేశ్, పగడాల సతీశ్ పాల్గొన్నారు.

సమసమాజ స్వాప్నికుడు..

వరంగల్: సమసమాజ స్వాప్నికుడు బీఆర్ అంబేడ్కర్ అని మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ కాశిబుగ్గ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి కొండా సురేఖ, బల్దియా మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకమేనన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కాశిబుగ్గ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు చనిపో..

ఆస్తి కోసం తండ్రికి కొడుకు, కోడలు మానసిక వేధింపులు
● మనస్తాపంతో గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య
● కడారిగూడెం గ్రామంలో ఘటన
● పోలీసులకు మృతుడి కూతురు ఫిర్యాదు.. కేసు నమోదు


మల్లేశం(ఫైల్)

వర్ధన్నపేట : ప్రస్తుత సమాజంలో రక్తసంబంధాలు మంటగలుస్తున్నాయని చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ. ఆస్తి కోసం కన్న తండ్రి అని చూడకుండా కుమారుడు, కోడలు నిత్యం వేధింపులకు గురిచేసి అతడు బలవన్మరణానికి పాల్పడేలా కారణమయ్యారు. పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తుండగా దీనికి ఆ వృద్ధుడు ససేమిరా అంటున్నాడు. దీంతో మానసికంగా హింసిస్తున్నారు. నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు మందు తాగి చనిపో అని కోడలు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఆ వృద్ధుడు గడ్డిమందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కడారిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశం(93)కు నలుగురు సంతానం. చిన్న కుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్ర.. గత కొద్ది రోజులుగా ఆస్తి కోసం నిత్యం వేధిస్తున్నారు. మల్లేశం పేర ఉన్న పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని మానసిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఎలేంద్ర 'నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు.. మందు తాగి చనిపో' అని మామ మల్లేశంను వేధించింది. దీంతో మల్లేశం ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన రెండో కుమారుడు చంద్రమౌళి వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆదివారం రాత్రి 8.20 గంటలకు మల్లేశం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కూతురు అమరావతి విజయ ఫిర్యాదు మేరకు చిన్నకుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ సోమవారం తెలిపారు.

ఎలుగుబంటి కళేబరం లభ్యం

● విద్యుత్ తీగల ఉచ్చుకు బలి?

కాటారం: మహాముత్తారం మండలం యత్నారం అటవీ ప్రాంతంలోని కొండెంగులవాగు సమీపంలో సోమవారం ఎలుగుబంటి కళేబరం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. యత్నారం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పలువురు ఎలుగుబంటి కళేబరం చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. మూడు, నాలుగు రోజుల క్రితం ఎలుగుబంటి మృతి చెందినట్లు గుర్తించారు. కళేబరం సమీపంలో విద్యుత్ తీగలు ఉండటంతో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు బలై ఉంటుందని భావిస్తున్నారు. ఎలుగుబంటి మాంసం, గోర్లను వేటగాళ్లు తీసుకుని కేవలం కళేబరాన్ని మాత్రమే వదిలి వేశారు. దీంతో వేటగాళ్ల విద్యుత్ తీగలకే ఎలుగుబంటి బలైందని స్పష్టమవుతోంది. ఎలుగుబంటి కళేబరాన్ని ఫారెస్ట్ కాళేశ్వరం జోనల్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఎఫ్ జోగేందర్, ఇతర అధికారులు పరిశీలించారు. ఎలుగుబంటి మృతిపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, మహాముత్తారం అటవీ ప్రాంతంలో యత్నారం, సింగారం గ్రామాల మధ్యలో విద్యుత్ లైన్‌కు ఉచ్చులు బిగించి వన్యప్రాణుల వేట జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారుల కనుసన్నల్లోనే ఇక్కడ తతంగం జరుగుతుందని, పలువురు సిబ్బంది పాత్రులుగా ఉన్నారని చర్చ జరుగుతోంది.

రూ.53.28 లక్షల విలువైన గంజాయి పట్టివేత

● నలుగురు అరెస్ట్
● వివరాలు వెల్లడించిన మానుకోట డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

కురవి: రూ.53.28 లక్షల విలువైన 106 కిలోల 960 గ్రాముల ఎండు గంజాయి పట్టుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కురవి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్ ఎదుట ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఎస్సై గండ్రాతి సతీశ్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ఓ కారు కనిపించడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో మరిపెడ మండలం తండా ధర్మారంకు చెందిన బానోత్ మహేందర్, ఒడిశాకు చెందిన నర్సింగ్ మడి, రామచంద్ర మడి, మాడ్కమి చంద్రను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఎండు గంజాయి పట్టుకున్న ఎస్సై సతీశ్, సిబ్బందికి రివార్డులు అందజేశారు. కాగా, నిందితులు ఒడిశాలోని చిత్రకొండ వద్ద ఎండు గంజాయి కొనుగోలు చేసి కారులో ఏపీలోని విశాఖపట్టణం నుంచి ఖమ్మం మీదుగా మరిపెడ వెళ్లేందుకు కురవి వైపునకు వచ్చి పోలీసులకు పట్టుబడ్డారు.

నేడు సరస్వతి పుష్కరాల యాప్ ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల యాప్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో మంగళవారం(నేడు) ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ యాప్‌లో సరస్వతి పుష్కరాలకు సంబంధించిన సమగ్ర సమాచారం నిక్షిప్తమై ఉండనుంది. కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవస్థానం ఈఓ మహేశ్ హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నారని ఆలయ వర్గాల ద్వారా తెలిసింది.